కర్నూలు | నంద్యాల
వార్త
13 మార్చి , 2025 గురువారం పేజీలు 4

సెక్షన్ 22ఎ1 భూముల పరిష్కారంపై ప్రత్యేకశ్రద్ధ చూపండి: జిల్లా కలెక్టరు

నంద్యాల, మార్చి 12, ప్రభాతవార్త ప్రతినిధి

సెక్షన్22ఎ1 భూములు, చుక్కల భూముల పరిష్కారంపై స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింటు కలెక్టరు విష్ణుచరణ్‌తో కలిసి 22ఎ1భూములు, చుక్కల భూములు నిషేధిత జాబితాలో నుంచి తొలగింపుపై జిల్లా స్థాయి స్క్రూటిని కమిటీ సమావేశం నిర్వహించారు. నంద్యాల ఆర్‌డిఓ విశ్వనాథ్, డోన్ ఆర్‌డిఓ నరసింహులు, సంబంధిత మండల తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ

సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ సెక్షన్ 22ఎ1 భూములు, చుక్కల భూముల పరిష్కారంపై వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సెక్షన్ 22ఎ1 భూములు, చుక్కలభూములను నిషేధిత జాబితాలో తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించారని, ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న చుక్కలభూములు, సెక్షన్22ఎ1 భూములను పరిశీలించి అర్హతను బట్టి నిషేధిత జాబితాలో నుంచి డీనోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓలు, మండల తహశీల్దార్లను కలెక్టరు ఆదేశించారు.

పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం..

-105 కేసులకు సంబంధించి రూ.12.28 లక్షల విలువైన మద్యం..
- మార్కెట్ యార్డులో ట్రాక్టర్‌తో తొక్కివేత..

కోసిగి, మార్చి 12, ప్రభాతవార్త

కర్ణాటక మద్యం నియంత్రణలో భాగంగా వివిధ కేసుల్లో పట్టుకున్న కర్ణాటక మద్యం 26వేల టెట్రా ప్యాకెట్లను ఎక్సైజ్ శాఖతో పాటు సివిల్ పోలీసులు ట్రాక్టర్లుతో తొక్కించి ధ్వంసం చేసారు..బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులోని ఖాళీ స్థలంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో కోసిగి ఎక్సైజ్ సిఐ భార్గవరెడ్డి, ఎస్ఐలు కార్తీక్ సాగర్, కోసిగి ఎస్ఐ చంద్రమోహన్‌లు అక్రమ మద్యం 2442 లీటర్లను ధ్వంసం చేసి కాల్చివేసారు..ఈ సందర్భంగా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి వివిధ కేసుల్లో అక్రమంగా రవాణ అవుతూ పట్టుపడిన కర్ణాటక మద్యం సుమారు 26వేల ప్యాకెట్లను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీదేవి ఆదేశాల మేరకు ట్రాక్టర్‌తో ధ్వంసం చేసి కాల్చివేయడం జరిగిందన్నారు..ఇందులో కోసిగి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌తో పాటు కోసిగి పోలీసు స్టేషన్ అలాగే కౌతాళం పోలీసు స్టేషన్‌ల పరిధిలో సుమారు 105 కేసులకు సంబంధించి 26వేల టెట్రా ప్యాకెట్లను గ్రామ రెవిన్యూ సిబ్బంది సమక్షంలో ధ్వంసం చేసి కాల్చివేయడం జరిగిందన్నారు.డివిజన్ పరిదిలో ఎవరైన అక్రమంగా కర్ణాటక మద్యంను రవాణా చేస్తూ పట్టుపడితే మూడోసారి వారిపై పిడి యాక్టును పెట్టి అప్పటికి వారిలో మార్పురాక అలాగే ప్రవర్తిస్తే గ్రామ బహిష్కరణ చేసేందుకు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు.. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, సివిల్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్‌లు.. రద్దు కావా..!

- భారీగా వక్ఫ్ బోర్డు భూముల అక్రమ రిజిస్ట్రేషన్
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న రిజిస్ట్రేషన్ అధికారులు
- రిజిస్ట్రేషన్లు రద్దు పై ఆసక్తి చూపడం లేదా..?
- అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామంటున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



సరైన పత్రాలు లేకుండా నిషేధిత జాబితాలో.. ఉన్న వక్ఫ్ బోర్డు భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అవి అలాగే చెల్లుబాటు అవుతాయా... లేక రద్దు చేస్తారా.. అనేది ప్రస్తుతం ప్రజల్లో ఉన్న బలమైన ప్రశ్న. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు అలాంటి అక్రమ రిజిస్ట్రేషన్ లపై నామ మాత్రపు చర్యలే తీసుకున్నారు. దీంతో సదరు అక్రమ రిజిస్ట్రేషన్లు సక్రమమవుతున్నాయా.. అనే అనుమానం వస్తుంది.. దీంతో మరికొందరు అక్రమార్కులు సదరు భూములను కాజేసేందుకు పావులు కదుపుతున్నారు. అసలు వక్ఫ్ బోర్డు భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ లపై చర్యలు తీసుకోవడంలోనూ రిజిస్ట్రేషన్ అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. కాగా వక్ఫ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు ఖచ్చితంగా రద్దు చేస్తామంటున్నారు.

కర్నూలు, మార్చి 12, ప్రభాతవార్త : కర్నూలు నగరంలో వక్ఫ్ బోర్డు భూములు చాలానే ఉన్నాయి. ఆ భూములు కూడా నగర శివారులలో కాక నగరంలోని ప్రధాన ప్రాంతం లోనూ ఉండడం విశేషం. దీంతో సదరు భూములను దక్కించుకునేందుకు కొందరు అక్రమార్కులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఇప్పటికే కబ్జా చేసి అందులో స్థిరనివాసాలు ఏర్పరచుకున్నారు. మరికొందరు సబ్ రిజిస్ట్రార్ లతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో పెద్ద మొత్తంలో భూములు అక్రమార్కుల చేతిలోకి వెళ్లిపోయాయి. ఈ మధ్యకాలంలో కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో చాలా వక్ఫ్ స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యాయంటూ "వార్త" దినపత్రిక ప్రత్యేక కథనం అందించిన విషయం తెలిసిందే. ఆ కథనంపై స్పందించిన రిజిస్ట్రేషన్ అధికారులు కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌ను ఆ స్థానం నుంచి మార్చారు. మరో సబ్ రిజిస్ట్రార్ ను పోస్టింగ్ చేశారు. సబ్ రిజిస్టర్ పై చర్యలు తీసుకోవడం వలన..

● వివరాలు 2లో..

అక్రమ రిజిస్ట్రేషన్ లపై జిల్లా కలెక్టర్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా...

వక్ఫ్ బోర్డు భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని తాజాగా జాయింట్ కలెక్టర్ డా.నవ్యకు సూచించామన్నారు. ఆ విషయంపై జాయింట్ కలెక్టర్ విచారిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్ లను కచ్చితంగా రద్దు చేయిస్తామని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. అదే క్రమంలో అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేసే అధికారాన్ని ప్రభుత్వం తాసిల్దార్లకు ఇచ్చిందని తెలిపారు. అందుకు సంబంధించి త్వరలోనే ఆదేశాలు జారీ అవుతాయని... అక్రమ రిజిస్ట్రేషన్ లను కచ్చితంగా రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా వివరించారు.

అభివృద్ధి,సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది జగన్

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు,మార్చి 12,ప్రభాతవార్త : రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డినే అని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైకాపా నాయకులు,కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకుల ఆరాధ్య దైవమైన వాల్మీకి మహర్షి, భారత రాజా ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండ రా ష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని మరిచి వైసిపి నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడు తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు వైకాపా నాయకులు,కార్యకర్తలు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్లు షఫీవుల్లా,మల్లికార్జున అరికెర వీరేష్,జిల్లా ఉపాధ్యక్షుడు గిరి,జడ్‌పిటిసిలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

15వ వసంతంలోకి అడుగుపెట్టిన.. వైఎస్సార్‌సీపీ..!

- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల త్యాగఫలమే వైఎస్సార్‌సీపీ జెండా ఆవిర్భావం
- బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్న వైసీపీ శ్రేణులు
- ప్రజల పక్షాన నిలిచిన నేతను వదులుకున్నామని ఆవేదన
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, మార్చి12, ప్రభాతవార్త: బనగానపల్లె పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం నందు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ 15వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల గుండెల్లో నుంచి పుట్టుకొచ్చిన పార్టీ అని ఆ పార్టీకి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుకూలంగా నడిచే పార్టీ అని అన్నారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకువచ్చిన ఫీజు రీఎంబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇలాంటి మహోత్తరమైన ఎన్నో పథకాలను పేదలకు అందించాలనే మహోన్నతమైన ఆశయంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు వెలుతున్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడ్డా నాయకుడిని ఎందుకు వదులుకున్నామని ఆంధ్ర రాష్ట్రంలోని ప్రజలందరూ బాధపడుతున్నారని ఈ రోజు వైసీపీకి అండగా కోట్లాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారని తెలిపారు. ప్రజల పక్షాన ప్రజా నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం, యువత కోసం పోరాటం చేస్తునే ఉంటారని చెప్పారు. కోట్లాది రూపాయలు ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల చావులకు సైతం కారణమవుతున్నా కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి బుధవారం అన్ని జిల్లా కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయవాది అబ్దుల్ ఖైర్, అత్తార్ జాహీద్ హుస్సేన్, జిల్లెల్ల శంకర్‌రెడ్డి, సన్నల జనార్దన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, తమ్మడపల్లె యెన్నం రామసుబ్బారెడ్డి, వెంకటాపురం తూర్పింటి శ్రీనివాసరెడ్డి, వై.మనోహర్‌రెడ్డి, ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, కోడూరు రామచంద్రారెడ్డి, నాగరాజు, సంజీవ్, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, పూజారి శ్రీనివాసులు, వెంకటేశ్వర్ల గౌడ్(దేవుడు), మిట్టపల్లె కాటసాని రామకృష్ణారెడ్డి, కునుకుంట్ల రామన్న, కొత్తపేట రమణ, కరీం, గాలి హనుమంతరెడ్డి, మెటికెల నారాయణ, కైప ప్రతాప్‌రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వర్ నాయక్, అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా యువతపోరుబాటకు భారీగా.. తరలివచ్చిన యువత..!

- బకాయిలు, నిరుద్యోగ భృతిని వెంటనే చెలించాలని డిమాండుచేసిన మాజీ ఎంఎల్‌ఏ కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైకాపా నేతలు
- జిల్లా కలెక్టరు రాజకుమారి గణియాకు వినతిపత్రం అందజేసిన వైకాపా నాయకులు

నంద్యాల, మార్చి 12, ప్రభాతవార్త

వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాల్లో యువతపోరు కార్యక్రమాన్ని వైకాపా బుధవారం చేపట్టింది. నంద్యాల జిల్లా కేంద్రంలో వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ కాటసానిరాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లాలోని అన్ని నియోజకవర్గ ఇంచార్జిలు, మాజీ ఎంఎల్‌ఏలు, జెడ్‌పి చైర్మన్,ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి యువజనసంఘాల నాయకులు యువత పోరు కార్యక్రమంలో పాల్గొని నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి గణియాకు విద్యార్థుల ఫీజ రీఎంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని, నిరుద్యోగయువతకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలుచేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని , ఉద్యోగాలను కల్పించాలని పలుడి మాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం ఆపాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయ కుండ ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షులు యవతపోరు కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏలు శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి, శిల్పాచక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బ్రిజేంద్రారెడ్డి డా.సుధీర్, జెడ్‌పిచైర్మన్ ఎర్రబోతులపాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఎంపిపి శెట్టిప్రభాకర్, నంద్యాల వైకాపా ఉపాధ్యక్షులు దాల్‌మిల్ అమీర్‌బాష, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడటం పద్ధతి కాదన్నారు. ఎన్నికల హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకు ండ ఇబ్బందులు పెట్టడం ఏమిటని రాంభూపాల్‌రెడ్డి ప్రశ్నించారు.

వైభవంగా శ్రీప్రహ్లాద వరదస్వామి అమృతవల్లి.. కళ్యాణోత్సవం..!

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఆళ్లగడ్డ, మార్చి 12, ప్రభాతవార్తః ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో శ్రీప్రహ్లాద వరదస్వామి అమృతవల్లి అమ్మవార్ల కళ్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అహోబిలం 46వ పీఠాధిపతి సమక్షంలో అహోబిలం మఠం జనరల్ మేనేజర్ మురళీధరన్ జాబితా సలహా సభ్యులు వైకుంఠం మణియార్ అడ్మినిస్ట్రేషన్ సుదర్శన్‌ల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు క్రీడాంబి వేణుగోపాలచార్యులు శ్రీప్రహ్లాదవరదస్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఉదయాన్నే పద్మశాలీసంఘం వారు ఉభయ దారులుగా వ్యవహరించి అభిషేకంలో పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పల్లకీలో కొలువు వుంచి అర్చకులు ఎదర్కొల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు స్వామి అమ్మవార్ల పూలమాలలు తలపై పెట్టుకొని నృత్యం చేసిన చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఊరేగింపుగా కళ్యాణమండపం వద్దకు చేరుకున్న స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలచార్యులు అర్చకబృందం పీఠాధిపతి స్వామి ఆధ్వర్యంలో కళ్యాణం తంతు గావించారు.

సాంప్రదాయం ప్రకారం నాంది పురుష సూక్తం ఉపననాయనది కార్యక్రమాల తంతు ముగియగానే కంకణదారణ, జీలకర బెల్లం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేలాది మంది తిలకిస్తుండగా మాంగల్యదారణ తంతు జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్ల పాదాల చెంతను అర్చకులు ముత్యాల తలంబ్రాలు పోశారు.

ఎగువ అహోబిలంలో....ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు అయిన బుధవారం ఉత్సవమూర్తి శ్రీజ్వాలా నరసింహాస్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు తొట్టి తిరుమంజనం నిర్వహించారు. రాత్రి ఆశ్వవాహనంపై శ్రీజ్వాలా నరసింహాస్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు అహోబిలంలో .. ఎగువ అహోబిలంలో గురువారం శ్రీజ్వాలా నరసింహాస్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. దిగువ అహోబిలంలో ఉదయం కాలింగ నర్తన ఉత్సవం, సాయంత్రం తొట్టి తిరుమంజనం రాత్రి ఆశ్వవాహన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అభివృద్ధి మాటెత్తితే.. నెత్తిన కేసుల మూట..!

ఇప్పటి వరకు ఏమి ఏడ్చారు.. ? : మాజీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరుటౌన్, మార్చి 12, ప్రభాతవార్త : ఏపిలో పథకాల అమలుపైగానీ, అభివృద్ధి విషయాల గురించి నోరెత్తితే వైసీపీ నాయకుల నెత్తిన కేసుల మూట పెట్టడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మరి సంవత్సరం కావస్తున్నా కూటమి ప్రజా ప్రతినిధులు ఇప్పటి వరకు ఏమి ఏడ్చారని మాజీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. నందికొట్కూరులో బుధవారం విలేకరులతో బైరెడ్డి మాట్లాడుతూ కొత్త పథకాలు అలా వుంచి గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తున్నారని, ప్రజా స్వామ్యంలో ఇది పద్ధతా అని అన్నారు. ఇలా ప్రశ్నిస్తున్నందుకే వైసీపీకి చెందిన ప్రధాన నాయకులపై కేసుల కొరఢా ఝుళిపిస్తున్నారని, ఇది ప్రజలు జాగ్రత్తగా గమనిస్తున్నారన్నారు. ఎందుకంటే గత అసెంబ్లీ ఎన్నికల్లో మేము ఓట్ల కోసం ప్రజల వద్దకు వెళ్తే ఓట్లు వేస్తామంటూ తలలు ఊపారే కానీ తిరస్కరించలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, మూడేళ్ల తరువాత కూటమి నాయకులు ఓట్ల కోసం ప్రజల మధ్యకు వెళ్తే చీదరించుకుంటారన్నారు. అదుదాం అంధ్ర కార్యక్రమంలో భాగంగా రూ.119 కోట్లు నిధులు మంజూరు అయితే అందులో రూ.400కోట్లు స్కామ్ జరిగిందని కూటమి నాయకులు గగ్గోలు పెడుతున్నారని, వారి అరోపణలకు ఏమైనా పొంతన ఉందా అని బైరెడ్డి ప్రశ్నించారు. ముఖ్యంగా ఇలాంటి విమర్శలు ఎంతో పవిత్రంగా భావించే అసెంబ్లీలో లేవనెత్తడం హాస్యాస్పదమని, అన్నీ పనికిమాలిన అరోపణలు ఎన్ని రోజులు మాట్లాడుతారో వారికే వదిలేస్తున్నామన్నారు. అంతే కాకుండా ఈ నిధుల లెక్కలు కలెక్టర్ అకౌంట్‌లో ప్రైజ్ మనీ కింద ఎంత ఇచ్చారు, కిట్ల రూపంలో ఎంత ఇచ్చారు, తదితర వివరాలు రికార్డులో సాక్ష్యాధారాలతో సహా వారి వద్దే ఉన్నాయన్నారు. ముఖ్యంగా వాటికి సంబంధించిన లెక్కలు తెలిసిన అధికారి సీఎం పక్కనే ఉంటారని,తెలుసుకోవడం ఎంతసేపు పడుతుందన్నారు. అమాయక కార్యకర్తలపై కూటమి నాయకులు కేసులు పెడితే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వైసీపీ హయాంలో లక్షకు పైగా సచివాలయ ఉద్యోగాలు ఇస్తే, ఇవి ఉద్యోగాలా అని తెదేపా నాయకులు విమర్శించారని, కానీ కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగాలు బెల్టు దుకాణాలు, అక్రమ బియ్యం తరలింపు, ఇసుక తరలింపు ఇవి వారి ఉద్యోగాలు అని వారు సంబరపడుతున్నారన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకవైపు సీజ్ ద షిప్ అంటుంటే మరోవైపు రాష్ట్రంలో కూటమి నాయకులు రేషన్ బియ్యం షిపింగ్ చేస్తున్నారని అరోపించారు. రేషన్ బియ్యం తరలింపు, బెల్టుషాపులు, మద్యం సిండికేట్, ఇసుక తరలింపు కూటమి నాయకులు పంచుకుని మరీ ఉద్యోగాలు చేస్తున్నారని వ్యంగంగా విమర్శించారు.

వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్‌లు.. రద్దు కావా..!

(మొదటి పేజీ తరువాయి) : పూర్తి ఫలితం రాదని మైనార్టీ సోదరులు అంటున్నారు. సదరు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దుచేసి ఆ భూములను వక్ఫ్ బోర్డు కు అప్పగిస్తేనే సరిపోతుందని వారు డిమాండ్ చేస్తున్నారు. కానీ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు సదరు రిజిస్ట్రేషన్ లను రద్దు చేసే యోచనలో లేరు. ఇది తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాజాగా రిజిస్ట్రేషన్ జరిగిన వక్ఫ్ బోర్డ్ భూముల వ్యవహారంలో వివాదం తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఈనెల మూడవ తేదీన కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వేనెంబర్ 340 ఇందిరా గాంధీ కాలనీకి చెందిన ప్లాట్లు రిజిస్టర్ అయ్యాయి. ఫిబ్రవరి నెల 14వ తేదీన అదే 340 సర్వే నెంబర్ లోని స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇవి రెండు కూడా వక్ఫ్ కు చెందినవే .అదేవిధంగా కల్లూరు పరిధిలో 7ఏ, 124 , 128, 611 ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సర్వే నెంబర్లలోని వక్ఫ్ భూములు రిజిస్టర్ అయ్యాయి. 6 నెలల కాలంలో సుమారు 20కి పైగా వక్ఫ్ భూములు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఇక కర్నూలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జోహరాపురం ప్రాంతంలోని 154 సర్వే నెంబర్ లోని వక్ఫ్ బోర్డు భూములను 143 సర్వేనెంబర్ గా మార్చి రిజిస్ట్రేషన్ చేశారు. అదే కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో 154 సర్వే నెంబర్లు చాలా భూములు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగాయి. అందులో కొన్ని రిజిస్ట్రేషన్ లు మాత్రమే రద్దు చేశారు. ఇంకా అదే సర్వే నెంబర్ లో 30కి పైగా రిజిస్ట్రేషన్లు అలాగే కొనసాగుతున్నాయి. ఇది ఇలా ఉండగా అక్రమ రిజిస్ట్రేషన్లు కేవలం వక్ఫ్ బోర్డు భూములకు మాత్రమే కాదు.. సాధారణ భూములకు సైతం జరుగుతున్నాయి. అందుకు ఉదాహరణగా మునగాలపాడులోని 163 సర్వే నెంబర్లు 24 రిజిస్ట్రేషన్లు జరిగాయి. సదరు రిజిస్ట్రేషన్లకు లింక్ డాక్యుమెంట్లు గానీ.. వీలునామాలు గానీ లేవు. కేవలం మునిసిపల్ కార్యాలయం ఇచ్చిన ట్యాక్స్ రిసిప్ట్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే అసలు యజమాని ఉన్నారని వారికి ఈ రిజిస్ట్రేషన్ల వ్యవహారం తెలియకుండా చేశారని తెలుస్తోంది కేవలం మున్సిపల్ పన్ను రసీదు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు చర్చ జరుగుతుంది. సదరు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు బయటకు రావడంతో విషయం అందరికీ తెలిసిపోయింది. సదరు అక్రమ రిజిస్ట్రేషన్లు సైతం రద్దు చేయకుండా అలాగే కొనసాగిస్తుండడం గమనార్హం. ఈ విధంగా కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేయాలని మైనార్టీ సోదరులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

వివరణ.. ఈవిషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణిని ప్రభాతవార్త వివరణ కోరగా... జిల్లా రిజిస్ట్రార్ వద్ద చాలా వివాదాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన అక్రమ రిజిస్ట్రేషన్లు, ఇతర వివాదాలను విచారించాల్సిందిగా జిల్లా రిజిస్ట్రార్ ను ఆదేశించామన్నారు. కానీ ఆయన స్పందించడం లేదని... ఇప్పటివరకు అక్కడ 40కి పైగా వివాదాలు విచారణకు నోచుకోకుండా ఉన్నట్లు డీఐజీ కళ్యాణి చెప్పారు. ఈ విషయంపై త్వరలోనే చర్యలు తీసుకొని వివాదాలు పరిష్కరిస్తామన్నారు.

గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వ అదనపు సహాయం

ఆళ్లగడ్డ, మార్చి 12, ప్రభాతవార్తః పట్టణ గ్రామీణ గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందిస్తుందని ఆళ్లగడ్డ ఎంపీడిఓ పి మహాబూబ్ ఖాన్ తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న బిసి, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్టీ చెంచులకు లక్షరూపాయల వరకు ప్రభుత్వం అదనంగా సహాయం అందజేస్తుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు తమ కుల ఆదాయ పత్రాలను భార్యభర్తల అధార్‌కార్డులు గ్రామీణ లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను మీ సమీపంలోని సచివాలయాల యందు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

యువతను మోసం చేసిన వైసీపీనే పోరు డ్రామా ఆడుతుంది

గోనెగండ్ల మార్చి 12 ప్రభాతవార్త : గతంలో వైసీపీ ప్రభుత్వం యువతను జాబ్ క్యాలండర్‌తో మోసం చేసి గద్దెదిగి నేడు పోరు అని డ్రామాలు అడుతుందని మండల తెలుగుయువత నాయకులు ఐరన్‌బండ భాషా, సందీప్‌నాయుడు, రమేష్ నాయుడు, నాగరాజు, రాంపురం రపీక్, జయపాల్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వ ం ఐదేళ్లు ఫీజ్‌రియంబర్స్‌మెంట్, వసతి దివెన, పథకాల డబ్బును విద్యార్థులకు ఇవ్వకుండ మోసం చేసిందని వారు అన్నారు. వాస్తవంగా వైసీపీ నాయకులు పోరుచేయాల్సి వస్తే జగన్ ఇంటి ముందు పోరు జరపాలని వారు సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9నెలలోపే రూ.788కోట్లు ఫీజ్‌రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించిందని తెలిపారు. జగన్ పాలనలో దాదాపు 2100మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు పెద్దయ్య, ప్రభాకర్‌నాయుడు, వినోద్‌కుమార్ గౌడ్, మునిస్వామి, అంపన్న, దేవేంద్ర, నీలకంఠ, చంద్రన్న, ప్రభుదాస్, రాజేష్, నరేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

పుటాలమ్మ క్షేత్రంలో సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహాస్వామి

ఆళ్లగడ్డ, మార్చి 12, ప్రభాతవార్తః ఆళ్లగడ్డ మండలం ఆర్ కృష్ణాపురం గ్రామ సమీపంలో శ్రీరామతీర్థం పుటాలమ్మ క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహాస్వామి భక్తులను అనుగ్రహించారు. అలాగే చక్ర పెరుమాళ్ళ ఉత్సవం జరిగింది. రాత్రి చంద్రప్రభ వాహనంపై నరసింహాస్వామిని ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ సాయి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈబ్రహ్మోత్సవ కాలంలో ఆళ్లగడ్డకు చెందిన గుండా మనోహర్ ఆద్వర్యంలో అన్నదాన కార్య క్రమం జరుగుతుంది. ఈకార్యక్రమంలో క్రిష్ణాపురం పెద్దలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నాటుసారా అమ్మడం మానండి..జీవనభృతి కల్పిస్తాం

– ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఏసి హానుమంతరావు

వెల్దుర్తి, మార్చి12, ప్రభాతవార్త : నాటుసారా అమ్మడం మానివేయాలని వారికి తాము జీవనభృతి కల్పిస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని వెల్దుర్తి, పుల్లగుమ్మి గ్రామాలలో బుధవారం నవోదయ2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసి హానుమంతరావు మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకై రాష్ట్ర ప్రభుత్వం నవోదయ కార్యక్రమం రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏసి మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మటం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఏసి హనుమంతరావు, ఎస్టీఎఫ్ ఏసి సుధాకర్‌రెడ్డి, ఈఎస్ సుధీర్‌బాబు, తహశీలార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపిడిఓ సుహాసినమ్మ, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మంజుల, ఏఎస్సై బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శుద్ధజలాన్ని అందించేందుకు తమవంతు కృషి

– కోరమండల్ సహకారంతో ఆర్వోప్లాంట్ ఏర్పాటు

కొత్తపల్లె, మార్చి 12, ప్రభాతవార్తః విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దామోదర్ నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో సుమారు రూ.2.50 లక్షల వ్యయంతో నిర్మించిన శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తమ సంస్థ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో జోనల్ మేనేజర్ కిశోర్‌కుమార్, హెచ్ఆర్ మహేష్, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, పాఠశాల, స్థానిక గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి 104 సేవలు అందాలి

గోనెగండ్ల మార్చి 12 ప్రభాతవార్త

జిల్లాలోని మార్చి ప్రజలందరికి 104 ద్వార సేవలు అందాలని అందుకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలని జిల్లా 104 నోడల్ అధికారి రఘు కోరారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని 3వ సచివాలయ కేంద్రంలో ఏర్పాటు చేసిన 104 సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలు, గోనెగండ్ల ఆరోగ్యశాఖ సిబ్బందితో మాట్లాడారు. సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. ప్రజలకు సేవలు అందుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రంగారవళి, ఎంపీహెచ్‌వో హనుమంతు, ఏఎన్ఎం మాదవి, లక్ష్మి, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త నంది నారాయణరెడ్డి గుండెపోటుతో మృతి

కొలిమిగుండ్ల, మార్చి12, ప్రభాతవార్త: కొలిమిగుండ్ల మండల పరిధిలోని కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నంది నారాయణరెడ్డి బుధవారం ఉదయం షటిల్ ఆడుతుండగా గుండెపోటుకు గురై కుప్పకూలి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే నంది నారాయణరెడ్డి సొంత గ్రామం కనకాద్రిపల్లె గ్రామం కాగా మొదట్లో నాపరాతి పరిశ్రమను ఏర్పాటుచేసి అంచెలంచెలుగా ఎదుగుతూ గ్రానైట్ పరిశ్రమ ఏర్పాటుచేసి పారి శ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఈయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పుచ్చ వెంకట మల్లారెడ్డి, పుచ్చ శివశంకర్‌రెడ్డి నారాయణరెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా ఈయన మృతి వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

రూ.10వేలు ఆర్థిక సహాయం

పెద్దకడుబూరు, మార్చి 12, ప్రభాతవార్త విశ్వగురు బసవేశ్వర మహరాజ్ నూతన విగ్రహ ప్రతిష్టకు టిడిపి నేత నరవ రమాకాంత్‌రెడ్డి బుధవారం రూ.10వేలు విరాళాన్ని అందచేశారు. కౌతాళం మండల పరిధిలో వల్లూరు గ్రామంలో వశ్వగురు బసవేశ్వర మహరాజ్ విగ్రహ ప్రతిష్ట కొరకు ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు తనవంతు సహకారం అందించారు. విరాళం అందచేసిన రమాకాంత్‌రెడ్డికి విగ్రహ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకై భూమిపూజ చేసిన ఆర్డీఓ

– ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆర్డీఓ పిలుపు

మద్దికెర, మార్చి12, ప్రభాతవార్త; మండలకేంద్రమైన మద్దికెరలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మద్దికెరలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహా ఏర్పాటుకై భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జీవిత విశేషాలను, దేశానికి అందించిన సేవలను ప్రతిఒక్కరికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, గూడూరు ధనుంజయ, ఎంపీడీఓ కొండయ్య, తహసీల్దార్ ఎహసేన్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కోడుమూరు, మార్చి 12, ప్రభాతవార్త ః కోడుమూరులో బుధవారం మండల కన్వీనర్ బి.రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆ తరువాత ఈ కార్యక్రమానికి వచ్చిన వైసీపీ శ్రేణులంతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమర్ రహే అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రమేష్ నాయుడు బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి, రైతు బంధవుడైన వైఎస్సార్ ఆశయ సాధనల కోసమే వైసీపీ పార్టీ ఆవిర్భవించాందన్నారు. ఆ మహేనేత చూపించిన మార్గాల బాటనే పయనిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 9 నెలల కూటమి పాలన అన్ని రంగాలల్లో ఘోరంగా విఫలమైందని తీవ్ర స్థాయిలో విమర్శులు చేశారు. ఎన్నికల ముందుకు ప్రజలకిచ్చిన సూపర్ పథకాలను అమలపర్చడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. గత ప్రభుత్వం అందించిన పథకాలను ఏనాడు ప్రజలకు అందించడంలో తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందని ధీమావ్యక్తం చేశారు. ప్రజలను మోస పూరితమైన వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ప్రజలిక్చిన సంక్షేమ పథకాలను అందించలేక పోవడంతో ప్రజలంతా ఆ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలపై మాట తప్పని, మడమ తిప్పని నేత ఎవ్వరంటే ఆంధ్రరాష్ట్రంలో ఏకైక నేత జగనన్ననే అని గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, లింగన్న, సుబ్బారావు, ధరణిరెడ్డి, పాలాక్షిరెడ్డి, జగధీష్, గోపి, రవిశంకర్, వీరన్న, వెంక ట్రావు, నారాయణ, రవి, సురేష్, శ్యామ్, డిజె.రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నమస్తుభ్యం..

:–తల్లి నిను దలచి..పుస్తకమ్ చేతబట్టితిన్..నను దీవించవమ్మా..

:–బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా సరస్వతి పూజ..

కోసిగి, మార్చి 12, ప్రభాతవార్త : పదో తరగతి పరీక్షలను పదిలంగా రాసేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్న వేళ..పాఠశాలలో సరస్వతి నమస్తుభ్యం అంటూ సరస్వతి దేవిని స్మరిస్తూ..తల్లి నిను దలచి పుస్తకమ్ చేతబట్టితిన్ మమ్ము దీవించ రావమ్మా అంటూ విద్యార్థులు ఘనంగా సరస్వతికి పూజలు చేసారు..బుధవారం కోసిగిలోనిజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో పాటు పాఠశాలలోని విద్యార్థులందరూ తమకు మంచి జ్ఞాపక శక్తి రావాలంటూపరీక్షలలో మంచి మార్కులు రావాలని ప్రత్యేకంగా పూజలు నిర వ్హించారు.. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఖలీల్ అహ్మద్ నేతృత్వంలో జరిగినఈ సరస్వతి పూజ ప్రత్యేకమైన ఆధ్యాత్మికతను సంచరించుకుంది.. పిల్లలందరు సరస్వతి ముందు మోకరిల్లి తమకు మంచి జ్ఞానం ప్రసాదించాలంటూవేడుకున్నారు.. ఉపాధ్యాయులే పూజరులై..పూజా నిర్వహకులై..శ్లోకాలను పఠిస్తూ సరస్వతికి పూజలు నిర వ్హించారు..అనంతరం పాఠశాలలోనిఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు..గురువుల కాళ్లకు నమస్కారాలు చేసి తరగతి గదుల్లో తమకు విద్యాబుద్ధులు చెప్పి మంచి మార్గంలో వెళ్లేలా కృషి చేసిన గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ సందర్భంగా విద్యార్థులచే ఏర్పాటు చేసినసాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి..అనంతరం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భారీ హృదయాలతో తమ తోటి మిత్రులకు వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

ముందు జాగ్రత్త చర్యగా పైప్‌లైన్‌కు మరమ్మతు

కొలిమిగుండ్ల, మార్చి12, ప్రభాతవార్త: కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని కొలిమిగుండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి లీకేజీలను గుర్తించడం వాటికి మరమ్మతులు చేపట్టడం వంటి ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా శివరాముడు మాట్లాడుతూ ప్రజలు తాగునీటిని వృధా చేయకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలని కొలిమిగుండ్ల మండల ప్రజలను ఆయన కోరారు.

దిగంబర తిక్కతాత ఉరుసు సందర్భంగా అన్నదానం

– భక్తులకు భోజనం వడ్డించిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, నాయకులు

దేవనకొండ, మార్చి12, ప్రభాతవార్త; శ్రీశ్రీశ్రీ దిగంబర తిక్కతాత ఉరుసు సందర్భంగా శ్రీ స్వర్గీయ కేఈ మాదన్న జ్ఞాపకార్థంగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత బభజన సదుపాయం కల్పించారు. అందరూ కలిసి తిక్కతాత దర్శనం చేసుకున్న అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, మాజీ జెడ్పీటీసీ ఉచ్చిరప్ప, రామారావునాయుడు, మల్లికార్జునగౌడ్, మల్లయ్య, శాంతికుమార్, గిడ్డయ్యగౌడ్, రాజగోపాల్‌గౌడ్ తదితరులు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిక్కతాత ఉరుసు సందర్భంగా పత్తికొండ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్క భక్తుడు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నాడని తెలిపారు.

నాటుసారా రహిత సమాజాన్ని స్థాపిద్దాం

– ఎక్సైజ్ సీఐ విశ్వనాథరెడ్డి

గడివేముల, మార్చి06, ప్రభాతవార్త; నాటుసారా రహిత సమాజాన్ని నిర్మించి ప్రజా ఆరోగ్యాలను కాపాడుదామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. నవోదయం 2.0లో భాగంగా బుధవారం మండలంలోని బిలకలగూడూరు, గని, పైబోగుల గ్రామాల్లో గ్రామపెద్దల ఆధ్వర్యంలో నాటుసారా వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా ఊపేక్షించేదిలేదని హెచ్చరించారు. సారా తయారు చేసే వారి వివరాలను 9440902586, 7989409125 నంబర్‌లకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ బ్రహ్మయ్య, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యువతపోరు పేరిట వైసీపీ నాటకాలు...

– యువతపోరు తాడేపల్లిలోని జగన్ ఇంటి ముందు ధర్నా చేయండి

– గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం

– టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి

గడివేముల, మార్చి12, ప్రభాతవార్త; వైసీపీ ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి ఇప్పుడు యువతపోరు పేరిట నాటకాలు ఆడుతుందని, గత ఐదు సంవత్సరాల్లో వైసీపీకి గుర్తుకు రాని ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని జగన్ ఇంటి ముందు యువతపోరు ధర్నా చేపట్టాలని విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన సకాలంలో చెల్లించని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా, విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనమయ్యాయని, రహదారులకు గోతులు కూడా పూడ్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారులకు మరమ్మతులు చేయడం జరిగిందని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుర్తుకురాని ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన అధికారం కోల్పోయాక గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి ఖజానాను ఖాళీ చేసిందని, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి యువతపోరు పేరిట కొత్త నాటకం ఆడుతున్నాడన్నారు. 2014–2019 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థుల తరపున పూర్తి ఫీజులు నేరుగా కళాశాల యాజమాన్యానికి అందజేశారని గుర్తు చేశారు. కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రచార ఆర్భాటంతో విద్యాదీవెన, వసతిదీవెన అంటూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేశాడన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతాదీవెన రాక కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను వేధించారని గుర్తు చేశశరు. క్లోనచోట్ల హాల్ టికెట్లు కూడా నిలిపివేసి, పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. జీవో నంబర్ 77ను తీసుకొచ్చి పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసి రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను చదువుకోకుండా చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్‌లో రూ.3480 కోట్లు ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.780 కోట్లు నేరుగా కళాశాల యాజమాన్యానికి చెందిన ఖాతాలో జమ చేశశరన్నారు. వైసీపీ చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరి చేస్తే నైతిక బాధ్యత లేకుండా ఫీజు పోరుతో విద్యార్థును మరోసారి మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దేశం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దివానే మూగితాత ఉరుసు ఉత్సవాలు

దేవనకొండ, మార్చి12, ప్రభాతవార్త; మండలకేంద్రమైన దేవనకొండలో కొలువైన శ్రీ దివానే మూగితాత దర్గా ఉరుసు ఉత్సవాలు దర్గా కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఉత్సవాల్లో భాగంగా దర్గాను త్రీకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి అశ్వన్ని పూజారులు పురవీధులగుండా ఊరేగించారు. భక్తులు స్వామివారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా స్వర్గీయ కేఈ మాదన్న జ్ఞాపకార్థంగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తాదులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. స్థానిక సీఐ వంశీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్సీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

పరీక్షల సమయంలో హాస్టల్ పర్యవేక్షణ గాలికి..!

- స్థానికంగా నివాసంలేని పలువురు ఎస్‌డబ్ల్యూవోలు ఏబిసి డబ్ల్యూవోలు
- స్థానికంగా చిన్న రూమ్ అద్దెకు తీసుకున్న వైనం
- పరీక్షల సమయంలో కూడా నిర్లక్ష్యం చేస్తే ఉత్తీర్ణత శాతం ఎలా పెరుగుతుంది

ఆలూరు రూరల్, మార్చి12, ప్రభాతవార్త: ప్రస్తుతం పరీక్షల సమయంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు భరోసా చాలా అవసరం. అలాంటి భరోసా కల్పించాల్సిన డివిజనల్ స్థాయి అధికారులు, కొందరు వార్డెన్లు స్థానికంగా నివాసం లేకుండా సొంత ఊళ్లకు, ఇళ్లకు పరుగులు తీస్తున్నారు. సోషల్ వెల్ఫేర్లు మరియు డివిజనల్ అధికారులు నెల రోజుల్లో ఒక హాస్టల్‌నైనా తనిఖీ చేయకపోవడం గమనార్హం. ఆలూరు మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అరికెర గురుకులం హాస్టల్‌తోపాటు ట్రైబల్ స్కూల్, హాస్టల్ ఉన్నా విద్యార్థులు చదువుతున్నారా ప్రతి వార్డెన్ స్థానికంగా నివాసం ఉండి హాస్టల్స్‌ను పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులకు అన్ని రకాలుగా భరోసా కల్పించాలని ప్రభుత్వ నిబంధన ఉంది. కాని ఆలూరులో కొంత మంది వార్డెన్లు నివాసం లేకుండా సాయంత్రం అయితేనే తమ సొంతూళ్లకు వెలుతున్నారని కొన్ని విద్యార్థి సంఘాలు మరియు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే స్థానికంగా నివాసం లేకుండా సాయంత్రం అయితే ఊళ్లకు వెలుతుండడంతో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులను హాస్టల్‌లో నియమించి స్టడీ అవర్స్‌ను వారికి అప్పజెబుతున్నారు. అయితే విద్యార్థులు ప్రైవేట్ వ్యక్తుల మాటల వినకపోవడం మరియు పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతోపాటు వారు ఎలాంటి ఉత్తీర్ణత సాధిస్తారోనని కొంత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే ఒకట్రెండు హాస్టళ్ల వార్డెన్లు తప్ప మిగతా వారు మాత్రం చుట్టపుచూపుగా వచ్చి హాస్టల్‌లో తూతూ మంత్రంగా బయోమెట్రిక్ సైన్ చేసి వెళ్లిపోతున్నారు. ఇదేమని కొంత మంది వార్డెన్లను అడగ్గా కర్నూలులో మీటింగ్ ఉందని కుంటిసాకులు చెబుతూ వెళ్లిపోతున్నారు. ఇక శుక్రవారం, రెండవ శనివారం, ఆదివారాల్లో సొంతూళ్లకు ప్రయాణ మవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే రాత్రి సమయంలో అక్కడ ఉండే కొంత మంది నైట్ వాచ్‌మెన్లు మరియు స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించేందుకు ఏర్పాటుచేసుకున్న వ్యక్తులు వారిని పర్యవేక్షిస్తున్నారు. అయితే విద్యార్థులు చదువుతున్నారా లేదా అని గమనించేవారులేక విద్యార్థులు ఇలా పరీక్షల సమయంలో భరోసా కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తే ఉత్తీర్ణత శాతం ఎలా పెరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దీని పై జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి నిబంధనలను పాటించని వార్డెన్ల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాజకీయ అండదండలతో స్థల ఆక్రమణ

: గిరిజన మహిళపై దౌర్జన్యం పోలీసుస్టేషన్ లో పిర్యాదు

ప్యాపిలి మార్చి12 ప్రభాతవార్త: మండలంలోని ఎర్రగుంట్లపల్లెకు చెందిన బత్తుల రామేశ్వరరెడ్డి రాజకీయ అండదండలతో తమ స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమణకు పాల్పడుతున్నారని ప్యాపిలికి చెందిన చిట్యాల మనోరమ అనే మహిళ పోలీసు స్టేషన్ లో బుధవారం సిఐకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 293 సర్వే నెంబరులో ఏడు సెంట్ల స్థలాన్ని డోన్ పట్టణానికి చెందిన మర్రి గోవిందరాజులుతో కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్నామని తెలిపారు. స్థలానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తి స్థలం తమదని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక రాజకీయ నాయకుల ద్వార ఫోన్ లో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. స్థలాన్ని వదిలి వెళ్ళకపోతే చంపుతామని బత్తుల రమేష్ రెడ్డి వచ్చి కులం పేరుతో దూషించారని పిర్యాదు చేశారు. గిరిజన మహిళపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏపీ ఎరుకల సేవా సంఘం నాయకులు పిర్యాదు చేశారు. గిరిజన మహిళపై దౌర్జన్యానికి కారకునిగా మారిన పెనుబడి ఎరుకల మధు కుమార్ పై కూడ చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుల ద్రోహి అయిన మధు కుమార్ ని ఏపీ ఎరుకల సేవా సంఘం,కులం నుండి బహిష్కరించినట్లు నాయకులు తెలిపారు...

ఎక్సైజ్ శాఖలో పట్టుబడిన వాహనాల వేలం

కర్నూల్ హాస్పిటల్ మార్చ్ 12 ప్రభాతవార్త : ఈరోజు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరముల నిమిత్తం పట్టుబడిన వాహనముల వేలము ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరిగినది మొత్తం 24 వెహికల్ వాహనాలకు కాను 17 వాహనాలు వేలం ప్రక్రియలో లబ్ధిదారులు చేకూర్చుకున్నారు అప్సెట్ ప్రైస్ 426,500 వీటి పైన 35 పెరుగుదల కనిపించినది మొత్తం 5,77,800 వచ్చింది వీటికి 18 జిఎస్టి తో కలిపి వాటితో చలానా కట్టించి వాహనాలను రిలీజ్ చేయడం జరిగింది ఇంకా ఏడు వాహనాలు వేలంలో పాల్గొనక పోవడం వల్ల అలాగే ఉన్నాయి వీటిని మరొకసారి వేలం వేయడం ద్వారా వాహనాలను పంపడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎం సుధీర్ బాబు అధ్యక్షతన కర్నూల్ స్టేషన్ లో జరిగినది

ఎస్.బోయినపల్లిలో మాజీ సర్పంచ్ నర్సింగ్ నాగరత్నమ్మ అనారోగ్యంతో మృతి

– పార్టీలకతీతంగా నర్సింగ్ కుటుంబసభ్యులకు సంతాపం ప్రకటించిన నాయకులు...
– మాజీ ఎమ్మెల్యేలు కోట్లనుజాతమ్మ,కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు..
– అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు...

వెల్దుర్తి,మార్చి12,ప్రభాతవార్త : మండల పరిధిలోని ఎస్.బోయినపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నర్సింగ్ నాగరత్నమ్మ(94)అనారోగ్యంతో గ్రామంలోని తన స్వగృహంలో మంగళవారం కన్నుమూశారు. నర్సింగ్ కుటుంబం వెల్దుర్తి మండలానికే ఆదర్శంగా నిలిచింది.గ్రామాభివృద్ధికి సైతం ఆ కుటుంబం తమ స్వంత స్థలాలు విరాళంగా అందించారు. పాఠశాలకు, సచివాలయానికి, ఆసుపత్రికి, పశువైద్యశాలకు,బస్‌స్టాప్‌కు,అంగన్‌వాడీ కేంద్రానికి,ఇళ్లలేని వారికి తమ స్థలాలు ఇచ్చి వాటి నిర్మాణానికి సైతం సహకారం అందించారు.నర్సింగ్ నాగరత్నమ్మ రెండుసార్లు గ్రామ సర్పంచ్‌గా,ఒకసారి ఎంపిటిసిగా ఏకగ్రీవమై ప్రజలకు సేవలు అందించారు.ఆమె కుమారుడు గ్రామపెద్దలు,వెల్దుర్తి సొసైటీ మాజీ అధ్యక్షులు నర్సింగ్ కాంతారెడ్డి,ఆమె కోడలు ప్రస్తుత సర్పంచ్ నరి ్సంగ్ శివజ్యోతి,మనుమడు అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులు బంధువులకు,ఆప్తులకు నాగత్నమ్మ మృతిచెందిన సమాచారం ఇచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు.మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ,కాటసాని రాంభూపాల్‌రెడ్డి,పార్టీలకతీతంగా మండల నాయకులు బొమ్మనసుబ్బా రెడ్డి, బొమ్మిరెడ్డిపల్లి సుబ్బరాయుడు,మాజీ జడ్పీటిసి దేశాయ్ సమీర్‌కుమార్‌రెడ్డి,కంగాటి రాంమోహన్‌రెడ్డి,టి.ఇ.బలరాంగౌడ్,మాజీఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్,లక్ష్మీరెడ్డి, బొమ్మన రమాకాంత్‌రెడ్డి, నర్సాపురం రాజేశ్వరరెడ్డితో పాటు పలువురు బుధవారం బోయినపల్లి గ్రామానికి చేరుకొని నర్సింగ్ నాగరత్నమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆమె కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి తమ సంతాపం తెలియజేశారు.అనంతరం గ్రామపెద్దలు,కుటుంబసభ్యుల అశ్రునయనాల నడుమ అంతిమ వీడ్కోలు పలికారు.ఆమె అంత్య క్రియలు పూర్తిచేశారు.

నెహ్రూనగర్ జెడ్పీస్కూల్‌లో 10వతరగతి విద్యార్థులకు ఉచితంగా ఫ్యాడ్స్‌పెన్నులు పంపిణీ

– బాలకృష్ణ,మోక్షజ్ఞసేవాస సమితి అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు

పగిడ్యాల, మార్చి 12,ప్రభాతవార్త

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్ జెడ్పీపాఠశాలలో 10వతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు బాలకృష్ణ,మోక్షజ్ఞ సేవాసమితి అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు టిడిపి సీనియర్ నాయకులు లోకానందరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా ప్యాడ్స్,పెన్నులు, పెన్సిల్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నాయకురాలు మాంద్ర ఉమాదేవి, టిడిపి నాయకులు బండి జయరాజు సలహాచూనల మేరకు 10వతరగతి పరీక్షలు రాయబోతున్న 56 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా పాడ్స్,పెన్నులు, పెన్సిల్లు అందజేశామన్నారు. కష్టపడ కుండా ఇష్టంతోచదివి పరీక్షలు బాగా రాసి వందశాతం ఉత్తీర్ణతసాధించాలనీ, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకొనిరావాలనీ ఆశాభావ ం వ్యక్తం చేశారు. 1,2,3 స్థానాలలో మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహకరంగా బహుమతులు వెండిపతకాలు అందజేస్తామనీ బండారు శ్రీనివాసులు తెలిపారు. టిడిపి నాయకులు ఫరూఖ్‌భాషా, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, స్వామినాథం, విజయభాస్కర్, బెంజిమెన్, ఉపాధ్యాయులు విజయకుమారి, భార్గవి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ భూమిని పరిశీలించిన తహశిల్దార్

మంత్రాలయం,మార్చి 12,ప్రభాతవార్త: మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో నూతనంగా నిర్మించిన హాస్పిటల్ భూమిని మండల తహశిల్దార్ సల్కాపురం రవి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్‌సిఎం) సంస్థ ఆధ్వర్యంలో ఈహాస్పిటల్ నిర్మించినట్లు తెలిపారు.స.నం 355-1లో సుమారు 1.97 ఎకరములలో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు వైద్యం కల్పించే నిమిత్తం ఈ హాస్పిటల్ నిర్మించారన్నారు.పొలం యజమాని రేగిజార్జి ఈ భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయాలని ఇచ్చిన విన్నపం మేరకు ఈ భూమిని పరిశీలన చేశామన్నారు.ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ హాస్పిటల్ నిర్మాణం జరిగింటే తప్పకుండా ల్యాండ్ కన్వర ్షన్ చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదాము,విఆర్ఓ ఆనందు,గ్రామసేవకుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుకు రాజకీయం

– ఏపీడి పద్మావతి విచారణ – ఇరువర్గాల మధ్య ఘర్షణ

చిప్పగిరి, మార్చి, 12, ప్రభాతవార్త : చిప్పగిరి మండలంలో దౌల్తాపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు కోసం రాజకీయం వేడి ఎక్కింది. గ్రామంలో కొందరి ఫిర్యాదు మేరకు ఉపాధి హామీ జిల్లా పిడి ఆదేశాల మేరకు ఆలూరు ఏపీ డి పద్మావతి దౌల్తాపురం చేరుకొని గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో ఉపాధి కూలీలతో విచారణ చేపట్టింది. ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారా లేక ఒకరిని బదులుగా మరొక రు వెళ్తున్నారా అన్న సంగతిని పేర్లు చదివి కూలీల ద్వారా తెలుసుకొంది. ఒకరికి బదులుగా మరొకరు ఉపాధికూలీ పనికి వెళ్లకూడదని, ఇది ఉపాధి హామీ చట్ట ప్రకారం నేరం అన్నది. జాబ్ కార్డు లో పేరులో ఉన్న వాళ్లు మాత్రమే ఉపాధి హామీ పనికి వెళ్లాలన్నారు. సెప్టెంబర్,అక్టోబర్ నెలలలో ఉపాధి పనులు చేసిన కూలీలు వెళ్లారా లేదా అని విచారించింది. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఉపాధి పనులకు వెళ్లాలని అన్నారు. ఒకటి రెండు తప్పులు జరగవచ్చు కానీ తప్పులు సరిదిద్దుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్లు పని ప్రదేశంలో నిబంధనలు పాటించాలన్నారు. గ్రామంలో ఇరువర్గాలు ఏపీ డి కి సమాధానాలు తెలియజేశారు. విచారణ జరుగుతున్న సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చేసుకోవడంతో, విచారణ మధ్యలో ఆపి ఏపీ డి వెళ్లిపోయింది. చిప్పగిరి ఎస్సైసతీష్ కుమార్ సిబ్బంది రావడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విచారణ కార్యక్రమంలో ఏ పీ ఓ జుబేర్ అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్ మారుతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాధాకృష్ణ, నాయకులు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు, సచివాలయ సిబ్బంది ఈ విచారణలో పాల్గొన్నారు.

విధ్యార్థినీలకు పరీక్షల కిట్‌లు పంపిణీ

మంత్రాలయం,మార్చి 12,ప్రభాతవార్త: మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ఉన్న కెజిబివి పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విధ్యార్థినీలకు ప్రముఖ ఎలక్ట్రిషియన్ కిషోర్ కుమార్ పరీక్షల కిట్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శాంతి బుధవారం విలేకరులకుతెలిపారు. పాఠశాలలో ఉన్న సుమారు 38మంది పదవ తరగతి విధ్యార్థినీలకు ఈ కిట్లను పంపిణీ చేయడం జరిగింద న్నారు. ఇందులో ఓపరీక్ష అట్ట,పెన్,పెన్సిల్,రబ్బరు తదితర వస్తువులు ఉన్న కిట్లను పంపిణీ చేశారన్నారు.కావున విధ్యార్థినీలు చక్కగా చదువుకొని అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాక్షించారు. అనంతరం దాత కిషోర్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది భ్రమరాంబ,అనసూయ,రామకృష్ణవేణి,సరస్వతి,సునీత తదితరులు పాల్గొన్నారు.

అశేష భక్తజనుల మధ్య వైభవంగా రథోత్సవం

నందికొట్కూరు,మార్చి 12,ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శ్రీమత్కోణిదేల భ్రరాంబ మల్లికార్జుస్వామి తిరునాల సంధర్భంగా బుధవారం ఉదయం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అత్యంత వైభవంగా అలంకరించిన రథంలో వేదపండితు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి అమ్మవార్లర్ల ఉత్సవమూర్తులు ఆశీనులు కాగా అశేష జనం మధ్య రథం పురవీధులగుండా తిరుగుతు భక్తులకు దర్శనం మిచ్చారు. అంతరకు మంది టిడిపి సీనియర్ నాయకులు మాంద్ర శివానందరెడ్డి, నియోకవర్గం ఎమ్మేల్యే గిత్తా జయసూర్య స్వామివార్లకు పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భంధోబస్తు ఏర్పాటు చేశారు.

హాస్పిటల్ భూమిని పరిశీలించిన తహశిల్దార్

ఘనంగా ధీరేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవం

మంత్రాలయం,మార్చి 12,ప్రభాతవార్త: కర్ణాటకలోని హోసరత్తి ప్రాంతంలో వెలసిన శ్రీ ధీరేంద్రతీర్థుల ఆరాధన మహోత ్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మంత్రాలయం శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ఈవేడుకల్లో భాగంగా శ్రీ ధీరేంద్రతీర్థుల మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు.స్వామివారికి మహాపంచామృతాభిషేకం,మంగళహారతి తదితర పూజలు చేశారు.తరలివచ్చిన భక్తులకు విద్వాన్‌ఘోష్టి,పండితులతో ప్రవచనాలు అందించారు.అనంతరం విధ్యార్థులకు వేదపరీక్షలు నిర్వహించారు.ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి తప్తముద్రధారణ చేశారు.అనంతరం భక్తులను ఫల,పుష్ప,మంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

నాటుసారాతో అన్ని అనర్థాలే

రుద్రవరం, మార్చి 12, ప్రభాతవార్త

నాటుసారా తయారుచేయడం దా ్వరా ప్రతి ఒక్కరి జీవనవిధానంలో అన్ని అనర్థాలే చోటు చేసుకుంటాయని ఆళ్లగడ్డ ఎక్సైజ్ సిఐ విజయకుమార్ తెలిపారు. నాటుసారాను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా మండలపరిధిలోని హరినగరం గ్రామంలో నాటుసారా నిర్మూలనపై, నాటుసారా వలన కలిగే పరిణామాలపై ఎక్సైజ్ సిఐ ఆధ్వర్యంలో గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను సారారహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. సారా తయారీ విక్రయాలతో జీవనం సాగించేవారు ఎవరైనా ఉంటే ఇకపై ఆ పనులు మానుకోవాలని గ్రామస్తులకు సూచించారు నవోదయం 2.0 ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారిపై ఇకపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడైన నాటుసారా తయారుచేసిన, రవాణా చేసిన. నిల్వచేసినా అమ్మకాలు జరిపినట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సారాయి తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలు విక్రయించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నాటుసారా తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యానేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాస్, సరస్వతీ, ఎక్సైజ్ పోలీసులు, ఎపి నాబార్డు ప్రతినిధులు, గ్రామసర్పంచ్ కమల, విఆర్ఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మౌనిక, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మేల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వాల్మీకి నాయకులు

నందికొట్కూరు,మార్చి 12,ప్రభాతవార్త: 60 సంవత్సరాలుగా వాల్మీకులు ఎస్టీ జాబితాలో చేర్చాలని వారి కలను నెరవేర్చాలని ఆదోని నియోజకవర్గం ఎమ్మేల్యే డాక్టర్.పార్థసారథి అసెంబ్లీలో మాట్లాడడంపై ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల గౌరీశ్వరనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అందుకు గాను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అసెంబ్లీలో ప్రస్థావించడం హర్షణీయమని, ఎన్నో ఏళ్ళుగా వాల్మీకులు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తు న్యాయమైన మోదా కోసం కృషి చేస్తున్నారని, ఈ దిశగా ప్రభుత్వాన్ని ఎస్టీలో చేర్చేందుకు కృషి చేయాలని ఎమ్మేల్యే అభ్యర్థన సామాజిక న్యాయానికి మార్గదర్శకం అవుతందని ఆయన తెలిపారు.

ఎస్సీ,బీసి ఎస్టీలకు ఇంటి నిర్మాణాలకు అదనంగా పారితోషికం

– మండల గృహనిర్మాణ శాఖ ఎఈ అనిల్

పగిడ్యాల, మార్చి 12,ప్రభాతవార్త : పగిడ్యాల మండలంలో హౌసింగ్ లబ్ధిదారులకు గతంలో గృహనిర్మాణం కోసం యూనిట్‌కాస్టు రూ. 1,80,000లు ఇవ్వడంతో యూనిట్‌కాస్టు లబ్ధిదారులకు సరిపోయి నందున హౌసి ంగ్ నిర్మాణం కట్టుకోలేక ఇబ్బందికి గురవుతున్నారనీ ప్రభుత్వం గమనించి ఎస్సీలకు అధనంగా రూ.50,000లు, బిసీలకు రూ.50,000లు ఎస్టీలకు రూ.75,000లు చెంచుగూండెం వారికి రూ. 1,00000లు ఇవ్వడం జరుగుతుందనీ గృహనిర్మాణ శాఖ ఇంజనీర్ అనిల్, అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్, వర్కుఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ చక్కటి అవకాశాన్ని ఎస్సీ,బిసీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలఅన్నారు. ఈ అదనపు అమౌంటు నాలుగు విడతలుగా లబ్దిదారులకు అకౌంటుల్లో జమచేయడం జరుగుతుందనీ, కాబట్టి ప్రతి ఒక్క లబ్దిదారుడు బిల్డింగ్ మరమ్మత్తులు చేసుకోవాలని లబ్దిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

పంటనమోదు తుదిజాబితా విడుదల

రుద్రవరం, మార్చి 12, ప్రభాతవార్త

మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో రబీలో పంటలుసాగుచేసిన రైతుల పంట నమోదు తుది జాబితాను విడుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి సుమతి తెలిపారు. మండలపరిధిలోని యల్లావత్తుల, కోటకొండ గ్రామాల్లో సుమతి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన గ్రామసభల్లో ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రుద్రవరం మండలంలోని 16 రైతు సేవాకేంద్రాల్లో రబీలో సాగుచేసిన పంటల నమోదు తుది జాబితా ప్రదర్శించామన్నారు. గ్రామంలోని రైతులు తమ పంట నమోదు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 19లోగా రైతు సేవా కేంద్రాల ద్వారా సవరించుకోవాలని కోరారు. అలాగే సొంత పొలం కలిగిన ప్రతి రైతు విశిష్ట సంఖ్య కొరకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో విస్త్రరణాధికారి రాజు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రేష్మ, శివకృష్ణ, రేవతి,ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు ఇవ్వాలి

కొత్తపల్లె, మార్చి 12, ప్రభాతవార్తః టిడిపి అవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్‌పదువులు ఇవ్వాలని మాజీ సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ నీటి సంఘం చైర్మన్ చిన్ని పుల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు యాదవ్ టిడిపి నాయకులు నాగశేషన్న యాదవ్ తెలిపారు. కొత్తపల్లెలో వారు విలేఖరులతో మాట్లాడుతూ టిడిపి పార్టీ పుట్టినప్పటి నుండి పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదువులు ఇవ్వాలన్నారు. మండలంలో కష్టకాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి కార్యకర్తలకు తప్ప వైసీపీ పార్టీ కారకర్తలకు నామినేటెడ్ పదువుల ఇస్తే అలాంటి వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. నందికోట్కూరు నియోజకవర్గంలో రాష్ట్ర పార్టీ అదేశాలకు విరుద్ధంగా ఎన్నికల ముందు ఎన్నికల తరువాత వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారన్నారు. దీంతో అసలైన టిడిపి కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా ఇంచార్జీ మంత్రికి జరుగుతున్న విషయాలపై రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తామన్నారు. నిజనమైన కార్యకర్తలకు అన్యాయం జరగడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటికైనా అదిష్టానం గుర్తించి అసలైన కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.

అంధకారంలో ఉన్న వీధులకు వెలుగునివ్వండి

హోళగుంద,మార్చ్ 12ప్రభాతవార్త : హోళగుంద మండలకేంద్రంలో 4 వ వార్డు వీధులు దాదాపు పదేళ్లుగా అంధకారంలోనే ఉన్నాయని.పది సంవత్సరాల క్రితం సుమారు 30 కుటుంబాలు ఇల్లు నిర్మించుకొని నివసిస్తూ ఉన్నారన్నారు.అయితే ఈ వీధుల్లో విద్యుత్ సరఫరా లేక అక్కడి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. పక్క వీధిలో నుంచి విద్యుత్ తీగలు చెట్లు, కట్టెలకు కట్టి ఇండ్లలో విద్యుత్ సరఫరా చేసుకుంటున్నారు.అధికారులు గత 4 సంవత్సరాల క్రితం స్థంభాలు ఏర్పాటు చేశారు కానీ ఇంతవరకు ఆ స్తంభాలకు వీధి దీపాలు అమర్చలేదు.దీంతో స్థంభాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి.స్థంభాలు ఉన్నా ఆ స్తంభాలకు విద్యుత్ తీగలు లాగి వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్షం ప్రదర్శిస్తున్నారని అక్కడి నివాసితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తంబాలకు విధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ వీధి వాసులు అబ్దుల్ సుభాన్, తాహెర్, మహమ్మద్ తదితరులు కోరారు.

ల్యాబ్ టెక్నీషియన్ డే.. మా కోరికలు తీరేనా..

కర్నూల్ హాస్పిటల్ మార్చ్ 13 ప్రభాతవార్త: రేపు జరిగే ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా గ్రేట్ టు ల్యాబ్ టెక్నీషియన్స్ గా చేరి గ్రేటు ల్యాబ్ టెక్నిషన్ గానే రిటైర్డ్ అవుతున్నాము ఎటువంటి ప్రమోషన్లు లేకుండా ఒకటే పోస్టులో కొనే కొనసాగిస్తున్న మా ల్య

హౌసింగ్ లబ్దిదారులకు..అదనపు ఆర్థిక సహాయం

: ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50 వేలు ఎస్టీ లబ్దిదారులకు రూ.75 వేలు
పివిటీజీలకు రూ.లక్ష అదనపు ఆర్థిక సహాయం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, మార్చి 12, ప్రభాతవార్త : బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ లబ్దిదారులకు అందచేయనున్న అదనపు ఆర్థిక సహాయం అంశంపై కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి డిసెంబర్ 10, 2024 తర్వాత నిర్మాణంలో పురోగతి లో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్దిదారులకు అదనపు ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జి. ఓ . ఆర్టీ నెం .09 తేదీ 10 032025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు...ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్దిదారులకు రూ.75 వేలు, పివిటీజీలకు రూ.1.00 లక్ష అదనపు ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద 39 వేల వరకు ఇళ్లను మంజూరు కాగా, ఇందులో 22 వేల 590 ఇళ్లను పూర్తి చేయడం జరిగిందన్నారు...ఇంకా 16 వేల 91 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు.. హౌసింగ్ పథకం కింద 9 వేల 446 మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ లబ్దిదారులు ఉన్నారని, ఇందులో 4 వేల 28 మంది ఎస్సీ లు, 5 వేల 170 మంది బీసీలు, 248 మంది ఎస్టీ లు ఉన్నారన్నారు.. జిల్లాలో ఎస్సీ, బిసి లకు అదనంగా 50 వేల రూపాయలు, ఎస్టీ లకు అదనంగా 75 వేల రూపాయలు, పివిటిజి లకు అదనంగా లక్ష రూపాయలు ఇవ్వడం

ద్వారా జిల్లాలో అదనంగా 47.85 కోట్ల రూపాయలు ఖర్చవుతుందన్నారు... మరో 2 రోజుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇన్చార్జి లు లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వివరిస్తారన్నారు.. వారందరికీ కూడా మరల ఎఫ్ టీ ఓ జెనరేట్ చేసి హౌసింగ్ పథకం కింద అదనపు ఆర్థిక సహాయం అందచేస్తారన్నారు.. డిసెంబర్ 10, 2024 నాటికి ప్రోగ్రెస్ లో ఉన్న ఇళ్ళ నిర్మాణ లబ్దిదారులకు ఈ అదనపు ఆర్థిక సాయం వర్తిస్తుందన్నారు.. జిల్లాలో బేస్మెంట్ లెవెల్ లో 7 వేల 900 మంది ఇళ్ళు ఉన్నాయని, ఎల్ ఎల్ లో 1000 ఇళ్ళు, రూఫ్ లెవెల్ లో 1500 ఇళ్ళు, రూఫ్ కాస్ట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని, వివిధ కారణాల వల్ల ఇళ్ళ నిర్మాణాలు ఆగిఉంటే రాష్ట్ర ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకుని ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకోవాలని కలెక్టర్ గృహ లబ్దిదారులకు విజ్ఞప్తి చేశారు.. ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకు 39 వేల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు..ఇళ్ళ స్థలం, ఇల్లు మంజూరు కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.. ప్రెస్ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పిడి అజయ్ కుమార్ పాల్గొన్నారు..

అహోబిలంలో అడిషనల్ ఎస్పీ భద్రత చర్యల ఏర్పాట్ల పరిశీలన..

ఆళ్లగడ్డ, మార్చి12, ప్రభాతవార్త: ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని అహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఈబ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహాస్వామి కళ్యాణోత్సం ప్రజలు ఎక్కువ వచ్చి కళ్యాణాన్ని వీక్షించడం జరుగుతుంది కావునా బుధవారం నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ యుగంధర్‌బాబు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీనరసింహాస్వామి కళ్యాణోత్సవానికి ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు రానున్న సందర్భంగా ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు. మోటార్ బైక్‌లు, ఆటోలు, కార్లు, మొదలగు వాహనాల కొరకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఎగువ దిగువ అహోబిలం టెంపుల్ క్యూలైన్లు

కళ్యాణోత్సవం జరుగు ప్రదేశాలకు విఐపి గ్యాలరీలు, జనరల్ గ్యాలరీలు, ఎంట్రి, అండ్ ఎగ్జిట్‌లను వాహనాల పార్కింగ్ మొదలగు ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ స్వయంగా పరిశీలించి భద్రత చర్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీలక్ష్మీనరసింహాస్వామి కళ్యాణోత్సవానికి ఎలాంటి అంతరాయం లేకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులకు, సిబ్బందికి అప్పగించిన ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన అదేశించారు. ఈకార్యక్రమంలో ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్, రూరల్ సిఐ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

– 28మందికి రూ.17.22 లక్షల చెక్కులు పంపకం
– పాల్గొన్న నియోజకవర్గ టిడిపి నాయకులు

మంత్రాలయం,మార్చి 12,ప్రభాతవార్త: మంత్రాలయం నియోజకవర్గంలోని లబ్దిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను నియోజకవర్గ ఇదిపి ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. మాధవరంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 28మంది లబ్దిదారులకు మంజూరైన రూ.17,22,920 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకౌతాళం, కోసిగి,పెద్దకడబూరు, మంత్రాలయం మండలాల్లోని లబ్దిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశామన్నారు. నిరుపేదలకు సకాలంలో చికిత్సకోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధులను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చూడి ఉలిగయ్య,నరవ రమాకాంత్‌రెడ్డి, ముత్తురెడ్డి,పల్లెపాడు రామిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బసలదొడ్డి ఈరన్న,అడివప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్కూళ్లకు కొత్తయూనిఫాం

నంద్యాల, మార్చి 12, ప్రభాతవార్త ప్రతినిధి

వచ్చే విద్యాసంవత్సరం జూన్ 12 నుంచి రాష్ట్రంలో యూనిఫాంలు మారనున్నాయి. కొత్త యూనిఫాంలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమోదం తెలిపారు. ఏ రాజకీయపార్టీలకు సంబంధించిన రంగులు లేకుండ రూపొందించిన ఈ దస్తులు చూడముచ్చటగా ఉన్నాయని నారాలోకేష్ పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యార్థి కిట్‌లో భాగంగా విద్యార్థులకు యూనిఫాం, బ్యాగు, బెల్టును ప్రభుత్వం ఉచితంగా అందించనుంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

కౌతాళం, మార్చి12, ప్రభాతవార్త; మండలంలోని పలువురు హృద్రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి చేతులమీదుగా బుధవారం అందజేశారు. మండలంలోని బదినేహాల్ గ్రామంలో గతేడాది క్రితం మహబూబ్‌వలికి హార్ట్‌ఎటాక్ వచ్చింది. హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆసుపత్రిలో దాదాపు రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేసుకున్నాడు. అలాగే పి.షేక్షావలికి కిడ్నీ సమస్యతో కర్నూలు ప్రయివేట్ ఆస్పత్రిలో దాదాపుగా రూ.75 వేలు ఖర్చు పెట్టుకున్నాడు. వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదలైన చెక్కులను మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి చేతులమీదుగా అందజేశారు. ముల్లాబాబువలికి రూ.1,21,321, షేక్షావలికి రూ.32,255 చెక్కులను అందించామన్నారు. మొత్తం రూ.1,53,576 చెక్కులను అందించినట్లు చెప్పారు. టీడీపీ ప్రభుత్వం హృద్రోగులకు అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకకులలు ఉలిగయ్య, గ్రామ టీడీపీ నాయకులు నరసింహులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు సీఐ వెంకటచలపతి బదిలీ

– కొత్త సీఐగా ఎన్.శంకర్‌రెడ్డి
ఆలూరు రూరల్, మార్చి12, ప్రభాతవార్త:

ఆలూరు సీఐ వెంకటచలపతిని అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది నవంబర్ 14న సీఐగా నియమాకమైన వెంకటచలపతి ఐదు నెలలపాటు విధులు నిర్వహించారు. జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా బదిలీ అయ్యారా లేకపోతే ఇతరేతర కారణాల బదిలీ అయ్యారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ఆలూరు కొత్త సీఐగా అన్నమయ్య జిల్లాలో ఉమెన్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఉన్న శంకర్‌రెడ్డి ఆలూరు సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

దళిత ఉపాధి కూలీ అని నిర్లక్ష్యమా.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

: సర్పంచ్ ఆరోపణ..
మిడుతూరు మార్చి 12 ప్రభాతవార్త:

ఎక్కడైనా, ఎవరికైనా ప్రమాదం జరిగితే మానవత్వంతో వారిని కాపాడే ప్రయత్నం చేస్తారు, కానీ ప్రమాదకర స్థాయిలో పెద్ద తేనెటీగలు వ్యక్తిపై దాడి చేసిన సంబంధిత అధికారులు ఎవరూ స్పందించకపోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని ఉపాధి కూలీ దళితుడు అయినందుకే ఇలా నిర్లక్ష్యం చేశారా అంటూ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉపసర్పంచ్ అక్బర్ ఆరోపించారు. మండలంలోని తలముడిపి గ్రామ పరిధిలో ఉపాధి కూలీలు పనిచేస్తుండగా, పెద్ద రంగస్వామి అనే వ్యక్తి పై పెద్ద తేనెటీగలు దాడి చేయగా, ఫీల్డ్ అసిస్టెంట్ బాధితున్ని స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితునికి డాక్టర్లు భరత్ కుమార్ , శారదా, నర్సింగ్ ఆఫీసర్, మూర్తుజావలితోపాటు ఇతర సిబ్బందివెంటనే చికిత్స చేయడంతో ప్రాణాపాయ పరిస్థితి నుండి కోలుకోవడం జరిగింది. మిడుతూరు సర్వజన వైద్యశాలలో తేనెటీగల దాడికి గురై చికిత్స పొందుతున్న పెద్ద రంగస్వామిని గ్రామ సర్పంచ్

వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి పొద్దు పోయాక దాదాపు 11 గంటల 30 నిమిషాల సమయంలో పరామర్శించిన అనంతరం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాధితునికి 75 సంవత్సరాల వయస్సు ఉండగా, ఇప్పటికే అతనికి మూడుసార్లు గుండెకు స్టంటు వేశారని, భార్య కూడా చనిపోయిందని, ఉన్న నలుగురు ఆడపిల్లలకు వివాహం చేయగా, ప్రస్తుతానికి అతను ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. తేనెటీగల దాడికి గురై ఆస్పత్రిలో ఉండగా పక్కనే అడుగు దూరంలో ఉన్న మండల కార్యాలయం నుండి ప్రోగ్రామ్ ఆఫీసర్ మండల అధికారి గాని, ఏపీవో కానీ, లేదా అదే శాఖకు చెందిన సంబంధిత అధికారులు ఎవరూ దాడికి గురైన వ్యక్తిని పరామర్శించలేదని సర్పంచ్ అన్నారు. అతనికి ఏదైనా జరగకూడని జరిగి ఉంటే దానికి బాధ్యులు ఎవరని సర్పంచ్ ప్రశ్నించారు.అధికారుల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అని, మూడుసార్లు గుండెకు స్టంట్ వేయించుకున్న వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేమన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో నీడ కోసం షెడ్లు గాని, ప్రథమ చికిత్సకు కిట్లు గాని, మండలంలో ఇక్కడే కాదు,ఉపాధి పనిచేసే ఏ ప్రాంతంలో లేదని సర్పంచ్ అన్నారు. ఉపాధి కూలీని పరామర్శించే బాధ్యత అధికారులకు లేదా? దళితుడైనందుకా అధికారులు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం పెద్ద రంగస్వామి కోరుకుంటున్నాడని, ఈ సమస్యను తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సర్పంచ్ అన్నారు.

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కామదహనం

శ్రీశైలంప్రాజెక్టు,మార్చి12,ప్రభాతవార్త పాల్గుణ శుద్ధ చతుర్దశిని పుస్కరించుకోని బుదువారంనాడు సాయంకాలం ఆలయ ముందుబాగంలోని గంగాధర మండపం వద్ద కామదహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయంలో శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలను జరిపించబడ్డాయి. తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో మనోహరగుండం ఎదురుగా వేంచేబు చేయించి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించబడింది. ఈ పల్లకీసేవలోనే ఉత్సవమూర్తులు గంగాధర మండపం వరకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించిన తరువాత సాంప్రదాయాన్ని అనుసరించి మన్మధ రూపాన్ని దహనం చేయడం జరిగింది. కాగా మన్మధుడు శితపోభంగం చేయగా, కోపించిన పరమేశ్వరుడు మన్మధుడిని పాల్గున శుద్ధ చతుర్దశి రోజే దహించాడని పూరాణాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే కామదహనాన్ని నిర్వహించడం సాంప్రదాయమైనది. కామదహన కార్యక్రమాన్ని వీక్షించడం వలన శివకటాక్షం లబిస్తుందని పూరాణాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహాణాదికారి ఎం.శ్రీనివాసరావు, శ్రీస్వామివార్ల ప్రధానార్చకులు కె.శివప్రసాద్ స్వామి, ఆధ్యాపక ఎం.పూర్ణనంద ఆరాధ్యులు, ప్రజాసంబందాల ఆధికారి టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు, సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

– టిడిపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్
ఆలూరు,మార్చి 12,ప్రభాతవార్త : ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్ కోరారు. బుధవారం విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌ను కలిసి వీరభద్రగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని అలాగే నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆలూరు నియోజకవర్గం రాష్ట్రంలో అత్యంత వెనుకబడ్డ ప్రాంతమని ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫర్ చేయడానికి, అలాగే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని దాని ద్వారా రైతుల నీటి పొలాలకు నీటిని సప్లయ్ చేసుకొని ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే చంద్రబాబు లక్ష్యం

– మండలానికి రూ.6.95లక్షలు సిఎం సహాయ నిధి కింద చెక్కులు పంపిణీ

పెద్దకడుబూరు,మార్చి 12,ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని అందుకు అనుగుణంగా ఆరోగ్య శాఖకు పెద్దపీఠ వేస్తూ అధిక నిధులు కేటాయించడం జరిగిందని ఆరోగ్య శ్రీలో మార్పులు చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సిఎం కృషి చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి,మండల కన్వినర్ బసలదొడ్డి ఈరన్నలు అన్నారు. బుధవారం టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డితో కలిసి లబ్దిదారులకు సిఎం సహాయ నిధి కింద రూ.6లక్షల95వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో కల్లుకుంట,చిన్నతుంబళం,నౌలకల్,నాగలాపురం, పెద్దకడుబూరు గ్రామాలకు చెందిన జంగం శాంతప్ప,బోయ మానప్ప,అనంతలక్ష్మి తదితర 11మంది లబ్దిదారులకు చెక్కులు అందించడం జరిగిందన్నారు. గుండె ఆపరేషన్ తదితర వ్యాధులకు చికిత్స పొంది టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి ద్వారా సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడం జరుగుతుందని పేదలు ధైర్యంగా ఎటువంటి వ్యాధులకైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకలు మల్లికార్జున, విజయ్‌కుమార్,మీసేవ అంజినేయులు,నరసన్న,చిన్నతుంబళం వీరేష్‌గౌడ్, నౌలేకల్ రాజు,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కౌతాళం, మార్చి12, ప్రభాతవార్త;

అప్పులు అధికం కావడం, పంటలు సరిగా పండక పోవడంతో మనస్థాపం చెందిన మండలానికి చెందిన రైతు బైటిగేరి ఉలిగయ్య(60) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతుడికి సుమారు రూ.5 లక్షల దాకా అప్పులు ఉన్నాయని, ఆ అప్పులు తీర్చలేక, వాటికి వడ్డీలు చెల్లించలేక, పంటలు సరిగా పండకపోవడంతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఆనందమ్మ తెలిపారు. మృతుడి భార్య ఆనందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

అసెంబ్లీ సాక్షిగా అటవీశాఖ అధికారుల తీరుపై.. మండిపడ్డ శ్రీశైలం ఎమ్మెల్యే

ఆత్మకూరు మార్చి 12 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో కడప జిల్లా జ్యోతి క్షేత్రంలో ఇటీవల అటవీ శాఖ అధికారులు తొలగించిన కాశిరెడ్డి నాయన నిత్య అన్నదాన సత్రం పై స్పందించిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలో అనాదిగా నల్లమల అడవుల్లో వెలసిన శైవ క్షేత్రాల వద్ద భక్తులచే నిర్వహిస్తున్న కాశిరెడ్డి నాయన ఆశ్రమాలపై అటవీ శాఖ అధికారుల దాడులను సభ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని, అదే సమయంలో అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, అంతే కానీ లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్న ఆశ్రమలపై ఎలాంటి సమాచారం

లేకుండా, ప్రభుత్వానికి తెలపకుండా చర్యలకు అటవీ శాఖ అధికారులు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు శ్రీశైలం నియోజకవర్గం లోని బండి ఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రంలో సైతం గతంలో ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయని వెల్లడించారు, మళ్ళీ ఇలాంటివి జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. చేస్తూ భక్తుల సౌకర్యార్థం మహానంది దేవస్థానం గాజులపల్లె వరకు నిర్మిస్తున్న రహదారిని సైతం అడ్డుకున్నారని మండిపడ్డారు , కాశిరెడ్డి రెడ్డి నాయన ఆశ్రమం ను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే మరోసారి ఏ క్షేత్రంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అరికట్టాలని సభ దృష్టికి తీసుకెళ్లిన శ్రీశైలం ఎమ్మెల్యే..

సర్టిఫికెట్లు ఇప్పించండి సారూ..

: ఎస్వి డిగ్రీ కాలేజిలో సర్టిఫికెట్స్ గల్లంతు
: పోలీసుస్టేషన్ లో పిర్యాదు చేసిన విద్యార్థులు

ప్యాపిలి, మార్చి12 ప్రభాతవార్త: విద్య వ్యాపారంగా మారింది. కాలేజీకి వెళ్లి చదివే విద్య స్థానములో దూర విద్యను వచ్చింది. కష్టపడి చదవాల్సిన చదువు నేడు డబ్బులు ఉంటే చాలు అన్న స్థాయికి చేరుకుంది. ప్యాపిలి పట్టణంలోని ఎస్వి డిగ్రీ కాలేజిలో దూర విద్యా కేంద్రంను ఏర్పాటు చేశారు. డిగ్రీ విద్యార్థుల సర్టిఫికెట్స్ సర్టిఫికెట్స్ గల్లంతు కావడానికి ప్రిన్సిపాల్ పెనుబడి మధుకుమార్ ఉద్దేశ్య పూర్వకంగానే సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని విద్యార్థులు చెవిటి మహేష్, తొప్పెల సుమన్, మరిమేసి రూప లు స్థానిక పోలీసు స్టేషన్ లో సిఐకు బుధవారం పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి దూర విద్యా కేంద్రంలో సర్టిఫికెట్స్ తెప్పిస్తానని డబ్బులు తీసుకుని ఇంతవరకు సర్టిఫికెట్స్ ఇవ్వలేదని,తమతో పరీక్షలు రాయించలేదని పేర్కొన్నారు. కాలేజీలో సర్టిఫికెట్ల గల్లంతుపై విచారించాలని, డబ్బులు కూడ తిరిగి ఇవ్వలేదని, మూడు సంవత్సరాలుగా సర్టిఫికెట్స్ ఇవ్వకుండ నిర్లక్ష్యం చేస్తున్న ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు...

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

కల్లూరు మార్చి 12 ప్రభాతవార్త : రాష్ట్రంలో యువతను కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని వైస్సార్సీపీ కర్నూలు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి యువత పోరులో భాగంగా చేపట్టిన ర్యాలీలో తెలిపారు. మంగళవారం వైస్సార్సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎద్దుల శివారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందినట్లు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అధికారం చేపట్టగానే హామీలు తుంగలో తొక్కారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే ఫీజు రియంబర్స్ మెంట్ క్రింద ఇవ్వాల్సిన రూ. 4.400 కోట్లు బకాయిలు తక్షణమే విడుదల చేయాలినీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలనీ కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణ ప్రయత్నాలను ఉ మానుకోవాలని అలాగే పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యువతను చైతన్యం పరచి పోరాటం ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు దుర్గప్రసాద్ పాణ్యం, బాలు కర్నూలు,నజీర్ ఎమ్మిగనూరు, వెంకటేష్ కోడుమూరు,అశోక్ నాయుడు ఆలూరు,అశోక్ రెడ్డి పత్తికొండ, రాజశేఖర్ రెడ్డి మంత్రాలయం, నల్లారెడ్డి ఆదోని,యువజన విభాగం నాయకులు మధుమోహన్ రెడ్డి, వీరేష్, సాయి, బోయశివ, ప్రసాద్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

నంద్యాల, మార్చి 12, ప్రభాతవార్త ప్రతినిధి బైరవాణి చెరువులో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేస్తుండగా గ్రామస్తులు బుధవారంఅడ్డుకున్నారు. అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందని బైరవాణి చెరువులో అధికారపార్టీకి చెందిన కొందరు నాయకులు అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్రమతవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.